క్లుప్తంగా

'భానాజీపేటలో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు'

రఘునాథపల్లి: భానాజీపేటలో అనర్హులకు ఇందిరమ్మ మంజూరు చేశారని పలువురు గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలకు, ఆర్థికంగా ఉన్న వారికే ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇళ్లు వస్తాయని ఆశించిన నిరుపేదలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. మంజూరైన ఇందిరమ్మ ఇళ్లపై విచారణ చేపట్టి నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని వారు కోరారు.

'మౌలిక వసతుల కల్పన బీజేపీకే సాధ్యం'

చిల్పూరు: దేశంలో మౌలిక వసతుల కల్పన బీజేపీకే సాధ్యం అయిందని ఇది ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందని నియోజకవర్గం నాయకుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. చిన్నపెండ్యాల గ్రామంలో సోమవారం సమస్యలపై సందర్శన కార్యక్రమంలో భాగంగా పార్టీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోదీ 11 ఏళ్లలో చేసిన దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, దేశ రక్షణపై తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, వెలిశాల శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, పవన్, సాయి, రమేష్, పాల్గొన్నారు.

హరియాణా గవర్నర్‌ను కలిసిన మండల అధ్యక్షుడు

హైదరాబాద్ శిల్పారామంలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను చిల్పూరు మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నష్కల్ ఆకేరు వాగు నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పాంనూర్ గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు. ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే ఎంతటివారైనా చట్టపరంగా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

నివాళి

లింగాలఘణపురం: మండల కేంద్రంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే రొండ్ల లక్ష్మారెడ్డి వర్ధంతిని మండల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులు రొండ్ల నర్సిరెడ్డి, పాపిరెడ్డి, శ్రీనివాసురెడ్డి, మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు ఐలేని ఆగిరెడ్డి, స్థానిక నాయకులు రాజారవీందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఏదునూరి వీరయ్య, గవ్వల మల్లేశం, అఫ్జల్‌మియా, లింగాల వెంకటేష్, జానీపాషా, శ్రీహరి, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

హనుమంతుకు..

రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన రైల్వే ఉద్యోగి గడెం హనుమంతు అనారోగ్యంతో మరణించాడు. సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, నీలం ఐలేష్, గాదె మహేందర్‌రెడ్డి, మేకల నరేందర్, పేర్ని రవి, నీలం యువరాజు, కడారి రవి, గుండా వెంకటయ్య తదితరులు సోమవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలిసిన పరశురామ్

జనగామ రూరల్: నూతనంగా మంత్రిగా నియమితులైన అడ్లూరి లక్ష్మణ్ మాదిగను కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ సోమవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. అంబేడ్కర్ ఫొటో కరెన్సీపై ముద్రించాలని వినతి పత్రం అందజేశారు.

'ముస్లింలకు మంత్రి పదవి ఇవ్వాలి'

జనగామ రూరల్: ముస్లింలకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం కల్పించి మంత్రి పదవి ఇవ్వాలని న్యాయవాది ముమ్మద్ జమాల్ షరీఫ్ కోరారు. సోమవారం పట్టణంలో ఏక్ మీనార్ మజీద్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మౌలానా, అన్సర్, ఎక్బాల్, రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు విస్తృతం చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: వాసవీ క్లబ్ చేపడుతున్న సేవలను గ్రామీణ ప్రాంతాల్లో మరింతగా విస్తృతం చేయాలని క్లబ్ ఇంటర్నేషల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ వాసవీ వనిత ప్లాటినం క్లబ్ అధ్యక్షురాలు గన్ను కళావతి ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా వాసవీ వనితక్లబ్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులను పంపిణీ చేశారు. మమత, కిషోర్, కళావతి, శ్రీలత, సంతోష్, రమ, నర్సింహులు, నాగభూషణం, నాగరాజు పాల్గొన్నారు.

కరెంటు తీగలకు కర్రలే ఆసరా

- ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలు
- భయం గుప్పిట్లో రైతులు

నర్మెట: మండలంలోని సూర్యబండతండా (కపుర్యతండా) రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. కర్రలకు వేలాడుతున్న విద్యుత్ తీగలు కాస్తగాలి వచ్చినా కూలిపోయేలాగా వేలాడుతున్నాయి. స్థానిక వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా నిమిత్తం ట్రాన్స్ ఫార్మర్ నుంచి ఏర్పాటు చేసిన స్తంభానికి స్తంభానికి మధ్యన దూరం ఎక్కువగా ఉంది. విషయం అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో రైతులు తాత్కాలికంగా కర్రలను ఏర్పాటు చేసుకున్నారు. ఇది మరింత ప్రమాదకరంగా మారింది. దీంతో భూముల సాగు సైతం వదిలేశారు. వర్షాకాలం ప్రారంభమైనందున అధికారులు తక్షణం స్పందించి మిడిల్ పోల్స్ వేయాలని రైతులు కోరుతున్నారు.





విద్యుత్ తీగలకు సపోర్టుగా పెట్టిన కర్రలు

ప్రాణం పోతేకాని స్తంభాలు వేయరా..



రెండేండ్ల నుంచి మొత్తుకుంటున్నం. ప్రాణాలు పోతేనే స్తంభాలు వేస్తారా. వ్యవసాయం చేయాలంటేనే భయంగా ఉంది. రైతులంటేనే అధికారులకు చిన్నచూపుగా ఉంది.

- భూక్య మంజి, రైతు కపుర్యతండా

అధికారులు తక్షణం స్పందించాలి



వ్యవసాయం చేయాలంటేనే భయంగా ఉంది. తీగలను చూస్తే వణుకు పుడుతుంది కర్రలకు వేలాడుతున్న తీగలు ఎప్పుడు కింద పడతాయో తెలియడంలేదు. అధికారులు తక్షణం స్పందించి స్తంభాలు వేయాలి లేకుంటే ప్రాణాలు పోతాయి.

- భూక్య మంగ్యా, రైతు, కపుర్యతండా

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

తరిగొప్పుల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2024–2025 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై 4వ విడత సామాజిక తనిఖీలో భాగంగా సోమవారం ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో జరిగిన పనులపై అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చంద్రశేఖర్, జిల్లా విజిలెన్స్ అధికారి సంధ్య,ఎంపీడీఓ ఆలేటి దేవేందర్‌రెడ్డి,ఎస్ఆర్పీ భగవత్‌రావు సమక్షంలో చేపట్టిన పనులను వివరించారు. అంతకు ముందు చేపట్టిన సామాజిక తనిఖీల్లో ఏఏ గ్రామాల్లో ఎంత మేరకు తప్పిదాలు చోటు చేసుకున్నది సామాజిక తనిఖీ బృందాలు అధికారులకు వివరించారు. రూ.82,213 మేర తప్పిదాలు చోటుచేసుకోగా వెంటనే వాటిని చెల్లించాలని ఉపాధి సిబ్బందిని, రికవరీ చేసుకోవాలని ఏపీఓను అధికారులు ఆదేశించారు. అత్యధికంగా సోలిపూరం పంచాయతీ కార్యదర్శి ఫీల్డ్‌అసిస్టెంట్, టీఏలకు రూ.23,821 జరిమానా, రికవరీ వేయడం జరిగింది. ఎంపీఓ మాలతి,క్వాలిటీ కంట్రోలర్ రాజవర్ధన్, అంబుడ్స్‌మెన్ జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం

జనగామ: పట్టణం సూర్యాపేట రోడ్డులోని ఛత్రపతి శివాజీ విగ్రహం చౌక్ వద్ద సోమవారం హిందూ సామ్రాజ్య దినోత్సవ వడేకలను ఘనంగా నిర్వహించా రు. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి మోహన కృష్ణభార్గవ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి, హిందూ ఏక్‌తా నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందూ సామ్రాజ్య నిర్మాణకర్తగా ఛత్రపతి శివాజీ మహరాజ్ నిలుస్తారన్నారు. ఉల్లెంగుల రాజు, చిలువేరు హర్షవర్ధన్, పాశం శ్రీశైలం, కుందారపు బైరునాథ్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, రాఖేష్, మాస రాజు, అంబటి బాలరాజు, సంపత్ గౌడ్ పాల్గొన్నారు.



శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఉమారెడ్డి

- అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఉమారెడ్డి

రఘునాథపల్లి: మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దని సౌత్‌సెంటర్ తెలంగాణ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఆర్.ఉమారెడ్డి సూచించారు. సోమవారం కన్నాయపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యాన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూరియా అధికంగా వాడటం వల్ల కలిగే నష్టాల గురించి ఉమ్మారెడ్డి వివరించారు. రైతులు లైసెన్స్‌డ్ డీలర్ల ద్వారానే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి.. రశీదులు భద్రపర్చుకోవాలని సూచించారు, అధిక దిగుబడులు ఇచ్చే నూతన వంగడాల గురించి తెలియజేశారు. జిల్లా వ్యవసాయాధికారి డి.రామారావునాయక్ మాట్లాడుతూ పంటల మార్పిడితో అధిక దిగుబడులు పొందవచ్చని, రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు. సదస్సులో శాస్త్రవేత్త పి.అశ్విని, ఏడీఏ వసంత, హార్టికల్చరల్ అధికారి శంకర్, ఏఓలు కాకి శ్రీనివాస్‌రెడ్డి, చంద్రన్‌కుమార్, కరుణాకర్, ఆర్ఈఏసీ సభ్యుడు మంతపురి యాదగిరి, యాకూబ్, నరసింహులు, వినయ్‌కుమార్, కల్పన, జితేందర్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



బచ్చన్నపేట: భూమిపూజలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా పలు గ్రామాల్లో సోమవారం మొదటి విడత మంజూరైన ఇళ్ల నిర్మాణానికి వారు ముగ్గు పోసి భూమిపూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, విజయ డెయిరీ జిల్లా చైర్మన్ ధర్మారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు రమేశ్, ఇల్లందుల బేబి శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి సంతోష్, చిలుక మమతసంపత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

విజయవంతం చేయాలి



పాలకుర్తి: మాట్లాడుతున్న నాయకులు

పాలకుర్తి: ప్రజల కోసం పని చేసి ప్రాణాలర్పించిన కామ్రెడ్ గంగసాని (గబ్బెట) రఘుపాల్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య అన్నారు. సోమవారం వారు తిర్మలగిరి గ్రామంలో సంస్మరణ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల కోసం రఘుపాల్ చేసిన సేవలు మరువలేనివన్నారు. నేడు(మంగళవారం) జనగామలో నిర్వహించనున్న రఘుపాల్ సంస్మరణ సభకు తరలిరావాలని కోరారు. మండల కమిటి సభ్యుడు సోమ సత్యం, మాసంపల్లి నాగయ్య, ఏదునూరి మదార్, బెల్లి సంపత్ పాల్గొన్నారు.

రఘునాథపల్లి: జిల్లా కేంద్రంలోని కామాక్షి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే అమరజీవి గంగసాని రఘుపాల్ సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ పిలుపునిచ్చారు. మండలంలోని గబ్బెటలో ఆయన పార్టీ నాయకులతో కలిసి సంస్కరణ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు కడారి ఐలయ్య, ఇంజ వెంకటస్వామి, ముక్కెర నాగరాజు, పోషబోయిన అంజయ్య, ముక్కెర తిరుపతి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

నర్మెట: పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మండల పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీఓ బోడ పాటి అరవింద్ చౌదరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లుల చెక్కులను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు దామెర వంశి, కందకట్ల శ్రీధర్, యాకూబ్, రిజ్వాన్, సాంబయ్య, శ్రీకాంత్, నరేష్, పవన్ తదితరులు ఉన్నారు.



కొడకండ్ల: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్యదర్శులు

కొడకండ్ల: గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మండల కార్యదర్శులు డిమాండ్ చేశారు. దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీడీఓ నాగశేషాద్రిసూరికి పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రమం సమర్పించారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు శ్రీనివాస్,బాకి మధు, కోట బయ్యన్న, సందీప్, అభిలాష్, వంశీదర్‌రెడ్డి, కోమలత, స్వరూప, సంతోష్, సునయన, ఉపేందర్, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్ పూడ్చి వేత

జనగామ: పట్టణంలోని సూర్యాపేట రోడ్డులోని మ్యాన్ హోల్‌ను మూసి వేశారు. 'ప్రమాదకరంగా మ్యాన్ హోల్' శీరికన ఈనెల 9న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మ్యాన్‌హోల్ మూసి వేయడంతో వాహన చోదకులు, సమీప వాసులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్



మ్యాన్‌హోల్‌ను పూడ్చుతున్న సిబ్బంది

వంటల్లో నాణ్యత, శుభ్రత పాటించాలి

జనగామ రూరల్: కేజీబీవీలో వంటల్లో నాణ్యత, శుభ్రత పాటించాలని ఏఎంఓ శ్రీనివాస్ అన్నారు. సోమవారం చౌడారం కేజీబీవీలో జిల్లా స్థాయి వంటలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొత్త మెనూ ప్రకారం వంటలు ఎలా తయారు చేయాలో నేర్పించారు. కేజీబీవీల అధికారి గౌసియా బేగం, ప్రత్యేక అధికారులు నవీన, రాణి అకౌంటెంట్లు మమత రజిని, బచ్చన్నపేట, చిల్పూర్, దేవరుప్పుల, ఘన్‌పూర్ చౌడారం, కొడకండ్ల నుంచి 42 మంది కుక్‌లు పాల్గొన్నారు.



వంటలను పరిశీలిస్తున్న ఏఎంఓ శ్రీనివాస్

నియామకం



ఉష

రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ పేర్ని ఉష కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలిగా నియామకం అయ్యారు. జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు బడికె ఇందిర సోమవారం ఉషాకు నియామకపు ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ మండల మహిళా అధ్యక్షురాలిగా తనకు రెండోసారి అవకాశం కల్పించిన నేషనల్ మహిళా అధ్యక్షురాలు అల్కలాంబ, రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు బడికె ఇందిర, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, టిపిసిసి కార్యదర్శి సింగపురం ఇందిర, జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తామని ఆమె పేర్కొన్నారు.

యువకుడి పట్టుదల.. ఎన్‌హెచ్‌పై వెలిగిన లైట్లు

చిల్పూరు: నాలుగు లేన్ల జాతీయ రహదారిగా విస్తరణ జరిగిన నాటి నుంచి చిన్నపెండ్యాల గ్రామ బస్‌స్టేజీ వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయిస్తామని నాయకులు ఇచ్చిన హామీలు బుట్టదాఖలయ్యాయి. ఈ క్రమంలో గ్రామానికి చెందిన యువకుడు ఆకుల సాయికుమార్ నాలుగు నెలలుగా అధికారులు, కేంద్ర నాయకుల చుట్టూ తిరిగి ఎట్టకేలకు సోమవారం రాత్రి లైట్లు వెలిగించాడు. రోడ్డు విస్తరణ అనంతరం బస్‌స్టేజీ వద్ద లైట్లు లేకపోవడంతో రాత్రిళ్లు జరిగిన ప్రమాదాల్లో దాదాపు ఐదుగురు మృతి చెందగా.. 20 మంది వరకు గాయాలపాలయ్యారు. అయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో సాయికుమార్ ఈవిషయంపై పలుమార్లు ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి పనుల మంజూరుకు కృషి చేశారు. అనంతరం కార్మికుల వెంట ఉండి మూడు నెలల్లో పనులు పూర్తి చేయించిన అతను సోమవారం రాత్రి లైట్లను స్వయంగా ఆన్ చేశాడు.



విద్యుత్ వెలుగుల్లో చిన్నపెండ్యాల జాతీయ రహదారి, (ఇన్‌సెట్‌లో) లైట్లను ఆన్ చేస్తున్న సాయి

పూర్వవిద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం

నర్మెట: స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల పదో తరగతి తొలి బ్యాచ్ 2015–16 విద్యార్థినులు సోమవారం పాఠశాలలో హాజరై ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. దశాబ్ద కాలం అనంతరం కలుసుకున్న వారు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. పాఠశాలలో విద్యనభ్యసించిన శ్రీలత హైదరాబాద్ కోటి ఉమెన్స్ కళాశాలలో కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించడం గర్వకారణమని ఉపాధ్యాయులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బి. కృష్ణ, ఉపాధ్యాయులు భూక్య వాసు, జె.లచ్చిరాం, డి.లక్ష్మణ్, ఎల్. హరిసింగ్, బి.గురు, విద్యార్థినులు బి.మమత, బి. సోనియా, బి. విద్య, బి. యమున, బి. లావణ్య, బిందు, శిరీష తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థినులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



సన్మానం పొందిన విద్యార్థులతో ఆర్డీఓ వెంకన్న

- ఆర్డీఓ వెంకన్న

చిల్పూరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న అన్నారు. నష్కల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం హెచ్‌ఎం జాలి శ్రీదేవి అధ్యక్షతన 2024–25 పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సన్మాన కార్యక్రమానికి ఆర్డీఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెంచేందుకు హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రవీణ్, అవనిజ, రచనలతో పాటు వారి తల్లిదండ్రులను ఆర్డీఓ, తహసీల్దార్ సరస్వతి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్ణకంటి స్వప్నవెంకటేష్, ఎంపీటీసీ పాశం శిరీషసురేష్, ఉపాధ్యాయులు రాంమోహన్, శ్రీనివాస్, కరంచంద్, గీత, జ్యోతి, మంజుల, మాలతి తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

తరిగొప్పుల: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మొగుళ్ల మహిపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని సోలిపూరం గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ మందాడపు రామారావు,సిబ్బంది సత్యనారాయణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. సోమవారం తమ్మడపల్లి గ్రామంలో తహసీల్దార్ ఫణికిషోర్, లింగంపల్లిలో డీటీ స్రవంతి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దరఖాస్తులను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఎంఆర్ఐ వంశీ కృష్ణ, ఏఆర్ఐ మున్వర్ పాల్గొన్నారు.

దేవరుప్పుల: భూభారతితలో అపరిష్కృత భూసమస్యలు పరిష్కారం అయ్యే అవకాశాలు ఉన్నాయనిని తహసీల్దార్ ఆడెపు ఆండాళ్ అన్నారు. సింగరాజుపల్లిలో నిర్వహించిన సదస్సులో పలు రకాలకు చెందిన 61 దరఖాస్తులను స్వీకరించారు. రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

నర్మెట: ఇరువురిపై ఇనుపరాడ్‌తో దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసునమోదు చేసిన సంఘటన సోమవారం మండలకేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై నైనాల నగేష్ తెలిపిన వివరాలు. మండలకేంద్రానికి చెందిన బండి శ్రీను, వంగపల్లి రాజు ఆదివారం సాయంత్రం తమ ద్విచక్రవాహనంపై పోతారం వెళ్తున్నారు. కాగా, అదే దారిలో మట్టిలోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ గాలి రవి కుమారుడు మైనర్ బాలుడు ద్విచక్రవాహనానికి సైడ్ ఇవ్వకపోవడం, మట్టి ద్విచక్ర వాహన చోదకులపై పడుతుండటంతో ఓవర్‌టేక్ చేసి ముందుకు వెళ్లిన వారు ట్రాక్టరు నిలిపి నిలదీశారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ తండ్రి గాలి రవి ట్రాక్టర్‌లోని ఇనుప రాడ్‌తో కిందికి దిగి విచక్షణా రహితంగా ఇరువురిపై దాడి చేయడంతో శ్రీను తలకు, వంగపల్లి రాజు పక్కటెముకలకు తీవ్ర గాయాలయ్యాయి. వంగపల్లి రాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేట్టినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



అనిల్ (ఫైల్)

దేవరుప్పుల : వ్యసనాలకు బానిసగా మారి ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అప్పిరెడ్డిపల్లెలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మైల అనిల్ (20) మద్యం, మత్తు పదార్థాలకు బానిసై చదువుకు స్వస్తి పలికి తల్లిదండ్రులను బెదిరించుకుంటూ జీవించేవాడు. ఈ క్రమంలో వారం క్రితం పురుగుల మందు తాగగా ప్రాథమిక చికిత్స చేయగా ప్రాణపాయం తప్పింది. దీంతో తల్లి భద్రమ్మ కుటుంబ సభ్యులు ప్రవర్తన మార్చుకోవాని వారించినా వినకుండా తిరిగి ఆదివారం సాయంత్రం మత్తులోనే పురుగుల మందు తాగగా జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు యాకస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సృజన్‌కుమార్ పేర్కొన్నారు.